సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



పంట నష్టం.. పరిహారం కష్టం
ప్రకృతి ప్రకోపానికి పోలవరం విలీన మండలాల్లోని రైతులు ఏటా నష్టాన్ని చవిచూస్తున్నారు. భూములకు పరిహారం చెల్లించామన్న పేరుతో ప్రభుత్వం ఆదుకోవడం లేదు. 8లో



పేద విద్యార్థులకు వరం
ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఈ ఏడాది దరఖాస్తులు ఆహ్వానించారు. 8లో



మామిడిలో సస్యరక్షణ ఇలా..
మామిడి తోటలు డిసెంబర్, జనవరిలో పూతకు వస్తాయి. మామిడి రైతులు ఇప్పటినుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూస్తాం



కృష్ణాయపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చినతాడేపల్లి, కృష్ణాయపాలెం, పడాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం పరిశీలించే మిషన్లు పాడైతే సరి చేసి, ధాన్యం కొనుగోలు సమయానికి సిద్ధం చేయాలన్నారు. వారం రోజులు ముందుగానే మిల్లర్ల నుంచి గోనె సంచులు సేకరించి సచివాలయాల్లో భద్రపరచాలన్నారు. అనంతరం చినతాడేపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని, కృష్ణాయపాలెంలో వరి చేలను ఆయన పరిశీలించారు. జేసీ వెంట వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి సరోజ, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తదితరులున్నారు.

నేడు మహిళల భద్రతపై సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పని ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో మహిళల భద్రతపై ఈ నెల 23న ఉదయం 10 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) మదన్ మోహన్ మాలవ్య భవన్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు స్పందన ఫౌండేషన్ చైర్‌పర్సన్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి సయాని ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. గౌరవ అతిథులుగా కలెక్టర్ నాగరాణి తదితరులు పాల్గొంటారన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీను తొలగించిన ఘటనను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలలో వైరల్ చేస్తున్న వీడియో అవాస్తవమని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అవాస్తవ వీడియోలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలను ప్రచారం చేయడం, కుల, ప్రాంత, వర్గ విభేదాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం, వాటిని షేర్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అవాస్తవ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తే ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు

ఏలూరు(మెట్రో) : జిల్లా పరిషత్ యాజమాన్యంలోని అన్ని విభాగాల్లో బదిలీ అయిన ఉద్యోగులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బదిలీలు ఉద్యోగుల పని తీరు మెరుగుపరచడానికి, సేవల నాణ్యతను పెంచడానికి చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శ్రీమతి ఎస్ నిర్మలాజ్యోతి, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగుల బదిలీలు



ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఉద్యోగులను బదిలీలు చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా విధులు నిర్వర్తిస్తున్న వి.సూకరత్నంను ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి రెండో ఈఈగా నియమించారు. అలాగే ఇక్కడ దేవస్థానంలో ఏఈఓగా విధులు నిర్వర్తిస్తున్న మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ మద్దాల శ్రీనివాస్‌లను విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ కె.రాంబాబును అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి బదిలీ చేశారు. అలాగే విజయవాడ దేవస్థానంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.అశోక్, సూపరింటెండెంట్ కేవీ దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.సతీష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావు, డ్రాఫ్ట్‌మెన్ ఎస్.రామకృష్ణలను ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు.



తణుకులో నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు



కామవరపుకోటలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంభం విజయరాజు తదితరులు

రఘురామకృష్ణరాజుపై మండిపడ్డ దళితులు

కాళ్ల మండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ **అంబేడ్కర్** చిత్రపటం ఉన్న ఫ్లెక్సీని ఎమ్మెల్యే **రఘురామకృష్ణరాజు** లాగి పారేయడంపై **ఉమ్మడి** పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా **దళిత** నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. ఆదివారం పలుచోట్ల అంబేడ్కర్ **విగ్రహాలకు** క్షీరాభిషేకం చేసి నిరసన **తెలిపారు.** రఘురామకృష్ణరాజు తక్షణం **క్షమాపణ** చెప్పాలని, శాసన సభ్యత్వాన్ని **రద్దు** చేయాలని డిమాండ్ చేశారు.

- అంబేడ్కర్‌ను అవమానించడంపై ఆగ్రహం
- తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నిరసనలు



భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్ తదితరులు



తాడేపల్లిగూడెంలో నిరసన కార్యక్రమం



దెందులూరులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ సంఘ రాష్ట్ర నాయకులు



నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో రఘురామకృష్ణరాజుపై ఫిర్యాదు చేస్తున్న మాల యోధుల సంక్షేమ సంఘం నాయకులు

భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పీకివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం భీమవరంలో అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్‌పై, దళితులపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. రఘురామకృష్ణరాజు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే చలో ఏలూరుపాడు పిలుపునిస్తామన్నారు. ధర్నాలో గంటా సుందర్‌కుమార్, తాళ్లూరి మధు, పాలపర్తి జోనా, పాలవెల్లి మంగ, బిరుదుగడ్డ రమేష్, పట్టిం శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

ఏపీ బహుజన జేఏసీ, జై భీమ్ సేవాదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అనుచిత ప్రవర్తనపై ధ్వజమెత్తారు. జాతులు, కులాల మధ్య గొడవలు సృష్టించేలా ప్రవర్తించారన్నారు. అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. కార్యక్రమంలో ఏపీ బహుజన జేఏసీ ఫౌండర్ ఫౌండర్ అండ్ కన్వీనర్ తాళ్లూరి మధు, జై భీమ్ సేవాదళ్ మీసాల జయరాజు, నల్లి రాజేష్, గుమ్మాపూ సూర్య వరప్రసాద్, బిరుదు రమేష్, పెంద్ర వీరన్న, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

నూజివీడు : బీఆర్ అంబేడ్కర్ పట్ల రఘురామకృష్ణరాజు వ్యవహరించిన తీరు అనాగరికమని మాల యోధుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సభ్యుడు చేబత్తిన కోటేశ్వరరావు(మున్నా) అన్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డు శ్రీనివాస మహల్ సెంటర్‌లో రఘురామకృష్ణరాజు వ్యవహార శైలికి నిరసనగా మాల యోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. అంబేడ్కర్ ఫ్లెక్సీ బ్యానర్ చించి వేయడం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో రఘురామకృష్ణరాజు అహంకార స్వభావం, దళితులపై చిన్నచూపు బహిర్గతమైందన్నారు. తక్షణమే ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందిస్తామన్నారు. నూజివీడు పట్టణ పోలీసు స్టేషన్‌లో రఘురామకృష్ణం రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్ సీఐ సత్య శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

రఘురామకృష్ణరాజు తీరు అమానుషం

కామవరపుకోట : రఘురామకృష్ణరాజు రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాతపై కనీసం గౌరవం లేకుండా ప్రవర్తించిన తీరు అమానుషమని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. ఆ ఘటనకు నిరసనగా ఆదివారం కొత్తూరు బస్టాండ్ ఎదురుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని దళిత నాయకులతో కలిసి నిరసన తెలిపారు. రఘురామకృష్ణరాజు వెంటనే అంబేడ్కర్‌కు, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్, బందేల ప్రభాకర్, మేడంకి చిన్న తదితరులు పాల్గొన్నారు.

దళితుల వ్యతిరేకి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : రఘురామకృష్ణరాజు దళితుల వ్యతిరేకి అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలిపారు.

కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న రఘురామ

తణుకు టౌన్ : బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించి ప్రజల మధ్య కులమతాల పేరుతో చిచ్చుపెడుతున్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావుపై దౌర్జన్యానికి పాల్పడిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీల శాసన సభ్యత్వాన్ని రద్దు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాలు ఆదివారం మధ్యాహ్నం తణుకులో నిరసన ర్యాలీ, రాస్తారోకోలు నిర్వహించారు. సామాజిక న్యాయ పోరాట సమితి, జై భీమ్ యూత్, సమతా యువజన సంఘం, న్యాయవాదులు, సమతా ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర సంఘాల ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం అనంతరం అక్కడే రాష్ట్రపతి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తణుకు నరేంద్ర సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ చిత్రం ఉన్న ఫ్లెక్సీని తొలగించే సమయంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వాడిన పదాలు దారుణమన్నారు. కాకినాడలో వైద్యుడు ఉమా మహేశ్వరరావుపై జనసేన మూకలతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సామాజిన న్యాయ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్, జిల్లా నాయకుడు బాతు వేణుగోపాల్, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, జై భీమ్ యువజన సంఘం పూర్వ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జోలికొస్తే పుట్టగతులుండవు

దెందులూరు: రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన వ్యక్తిపై కోర్టులు, ఎస్సీ కమిషన్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం మండలంలోని ఖండ్రిక నర్సింహపురంలో రాష్ట్ర నాయకులు కనికెళ్ల పెద్దిరాజు, మాంద్రు పెదబాబు, చిలకా హరీష్, సరిపల్లి మహేష్, సరిపల్లి రమేష్ నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోకపోతే బీసీ, దళిత గిరిజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

దిష్టిబొమ్మ దహనం

పోలవరం రూరల్ : రాజ్యాంగ నిర్మాతను అవమానించినందుకు నిరసనగా పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. రాష్ట్ర మాల మహానాడు నాయకుడు సాబ్బన మోహన్ నేతృత్వంలో నిరసన తెలిపారు. రాజద్రోహం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు.

విహారయాత్రలో పెనువిషాదం

- అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో ముగ్గురు ఆశ్రం విద్యార్థుల గల్లంతు
- భారీ వర్షానికి వాగు ఉప్పొంగడంతో ప్రమాదం
- కొట్టుకుపోయిన ఐదుగురిలో ఇద్దరు సురక్షితం
- మిగతా ముగ్గురి కోసం గాలింపు ముమ్మరం



మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లిన వైద్య విద్యార్థుల బృందం



మారేడుమిల్లిలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్నేహితుల కోసం వెదుకుతూ

మారేడుమిల్లి/ఏలూరు టౌన్ : అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా సాగిన ఏలూరు ఆశ్రం వైద్య విద్యార్థుల విహారయాత్ర ఒక్కసారిగా విషాదంగా మారింది. కొండల్లో కురిసిన భారీ వర్షానికి జలపాతం ఉప్పొంగడంతో నీటిలో కేరింతలు కొడుతూ ఫొటోలు దిగుతున్న విద్యార్థుల గల్లంతయ్యారు. ప్రవాహ ఉధృతికి ఐదుగురు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలతో బయటపడగా మిగతా ముగ్గురి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సహచరులు, కుటుంబసభ్యులు తల్లడిల్లిపోతున్నారు.

జిల్లా కేంద్రమైన ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది విద్యార్థులు ఆదివారం ఉదయం కాకినాడలోని స్నేహితుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి కాకినాడలోని బీచ్‌కు వెళ్లి అక్కడ కాసేపు ఉత్సాహంగా గడిపారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం వ్యాన్‌లో విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. అక్కడి నుంచి జలతరంగణి (వాగు) జలపాతం వద్దకు చేరుకున్నారు. అందరూ దిగి స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా కొండల్లో భారీ వర్షం కురిసింది. రెట్టించిన ఆనందంతో కేరింతలు కొడుతుండగా ఉన్నట్టుండి వాగు ఉప్పొంగింది. ఇది గమనించిన తొమ్మిది మంది విద్యార్థులు ఒడ్డుకు వచ్చేశారు. ప్రవాహం మధ్యలో ఉన్న సీహెచ్ హరదీప్, కె.సౌమ్య, బి.అమృత, గాయత్రీ పుష్ప, హరిణీప్రియ కొట్టుకుపోయారు.

ఇద్దరిని కాపాడిన చెట్టుకొమ్మ

కొట్టుకుపోయిన ఐదుగురిలో గాయత్రీ పుష్ప, హరిణీప్రియ చెట్టుకొమ్మలను పట్టుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సంఘటన జరిగిన ఆరు కిలోమీటర్ల దూరంలో భద్రాచలం ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వీరిని గమనించిన స్థానికులు, రెస్క్యూటీం ఒడ్డుకు చేర్చారు. హరదీప్, సౌమ్య, అమృత ఆచూకీ లభ్యం కాలేదు. ప్రాణాలతో బయటపడిన హరిణిప్రియ పరిస్థితి విషమంగా ఉంది. వాగులో మునిగి నీళ్లు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బండరాళ్ల కారణంగా గాయపడిన గాయత్రీ పుష్ప రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గల్లంతైన వారికోసం రాత్రి ఏడు గంటల వరకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై రాము తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చిన ఇద్దరు వైద్య విద్యార్థులను పరామర్శించారు. చికిత్స పొందుతున్న గాయత్రీ పుష్పకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

21న కళాశాలను విడిచి..

ఈ నెల 21న ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు సెలవుపై ఇళ్లకు వెళ్లారని ఆ కళాశాల సీఈవో కె.హనుమంతరావు తెలిపారు. సెలవుపై వెళ్లిన వారిలో కొందరు తమ స్నేహితులతో కలిసి మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లగా ప్రమాదానికి గురైనట్లు తెలిసిందన్నారు. ఎవరు విహారయాత్రకు వెళ్లారనే దానిపై కళాశాల సిబ్బంది ఆరా తీస్తున్నారని తెలిపారు. కె.సౌమ్యది విజయనగరం కాగా.. బి.అమృతది బాపట్ల జిల్లా. సీహెచ్ హరదీప్ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వారిగా గుర్తించామన్నారు.

అవయవ దానంతో నలుగురికి ప్రాణం



పోలిశెట్టి మురహరి (ఫైల్)

వీరవాసరం : తన కుమారుడు బతికే అవకాశం లేదని తెలిసి బ్రెయిడ్ డెడ్ అయిన తన కుమారుడి అవయవాలు దానం చేశారు ఆ తల్లిదండ్రులు. అవయవ దానం ఎంత అవసరమో తెలియచెప్పి భావితరాలకు ఆదర్శంగా నిలిచారు వీరవాసరం మండలం తోకలపూడికి చెందిన పోలిశెట్టి సుబ్రహ్మణ్యం, నాగపుష్ప. వీరికి ఇద్దరు కుమారులు ప్రవీణ్, మురహరి. మురహరి విజయవాడలో కెఎల్ యూనివర్సిటీలో చదువుతున్నాడు. పరీక్ష నిమిత్తం స్నేహితుడుతో కలిసి ఈ నెల 21న విజయవాడ నుంచి విశాఖపట్నం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుని సమీపంలో మురహరి నడుపుతున్న బైకును వెనుకనుంచి కారు ఢీకొట్టడంతో మురహరి వెనకాల కూర్చున స్నేహితుడు అక్కడికక్కడే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న మురహరిని తుని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అక్కడ నుంచి కాకినాడ అపోలో ఆసుపత్రి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు బ్రెయిడ్ డెడ్‌గా నిర్ధారించారు. ఈ విషయం మురహరి తల్లిదండ్రులకు చెప్పి మీ కుమారుడి అవయవాలు దానం చేస్తే మంచిదని చెప్పడంతో వారు అంగీకరించారు. దీంతో మురహరి గుండె, కళ్లు, లివర్, కిడ్నీలు మరొకరి దానం చేసేందుకు వారు ముందుకు వచ్చారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ జోన్–2లో సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు ఆదివారం ఏలూరులోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రారంభించారు. జోన్ పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల స్థాయిలో (కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి) జిల్లాలకు సంబంధించిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీకి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్ల బదిలీలకూ కౌన్సెలింగ్ చేపట్టారు. ఆదివారం రాత్రి 10 గంటల వరకూ సబ్ రిజిస్ట్రార్ల బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతూనే ఉంది. ఆయా జిల్లాలకు సంబంధించి మొత్తం 93 మంది సబ్ రిజిస్ట్రార్లు ఈ బదిలీల్లో స్థాన చలనం పొందుతారు. సుమారు 120 మంది సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు ఇస్తారు.



బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన సబ్ రిజిస్ట్రార్లు

క్లుప్తంగా

పాము కాటుకు బాలుడి మృతి


బాలుడి మృతదేహం

టి.నరసాపురం: పాము కాటుకు గురై బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన టి.నరసాపురం మండలంలోని బొర్రంపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. చింతలపూడికి చెందిన దుగ్గిరాల జేసుకుమార్(15) బొర్రంపాలెంలోని మేనత్త గంగమ్మ ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. గమనించిన బంధువులు వెంటనే చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. బాలుడి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయకుమార్ తెలిపారు.

1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


పోలీసులు ధ్వంసం చేస్తున్న బెల్లపు ఊట

నూజివీడు: మండలంలోని వెంకటాయపాలెం నందు మామిడి తోటలు, అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు తన సిబ్బందితో ఆదివారం వెంకటాయపాలెం పరిధిలోని మామిడి తోటలు, అటవీ ప్రాంతంలో సారా బట్టీలను గుర్తించి 1400 లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకొని అనంతరం ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రమ్ములను, అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


కన్నాపురంలో అక్రమంగా ఇసుక రవాణా

కొయ్యలగూడెం: ఇసుక రవాణా అక్రమార్కులకు కన్నాపురం పరిసర ప్రాంతాలు అడ్డాగా మారాయి. కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాల సరిహద్దు ప్రాంతాలలోని కొండ కాలువల నుంచి ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తూ లబ్ధి పొందుతున్నారు. పులిరామునిగూడెం, కన్నాపురం మధ్యన ఉన్నటువంటి కాలువలలో ఇసుకను రవాణా చేసి ట్రక్కు నాలుగువేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా విషయం తమ దృష్టికి వచ్చిందని నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.

కులం పేరుతో దూషించిన నేరంపై కేసు నమోదు

టి.నరసాపురం: కులం పేరుతో దూషించిన నేరంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెంకు చెందిన కొందరు వ్యక్తులు సోషల్‌మీడియాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా పోస్టులు పెట్టారు. దీనిపై గ్రామానికి చెందిన గుండె నాగేంద్ర, మరికొందరు వారిని ప్రశ్నించగా కులం పేరుతో దూషించారన్నారు. దీంతో బాధితులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తోట ప్రసాద్, సూరిలతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట నష్టం.. పరిహారం కష్టం

- ప్రకృతి ప్రకోపంతో నిండామునుగుతున్న విలీన రైతు
- భూములకు పరిహారం చెల్లించామన్న పేరుతో ఆదుకోని ప్రభుత్వం
- పంట నష్టపోయి గగ్గోలు పెడుతున్న విలీన రైతులు


గత నెల గోదావరి వరదతో ముంపునకు గురైన మిర్చి పంట


గోదావరి వరదతో ఎండిపోతున్న పత్తి పంట

కుక్కునూరు: ప్రకృతి ప్రకోపానికి విలీన మండలాల్లోని రైతులు ప్రతి ఏడాది సాగులో నష్టాన్ని చవిచూస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో బ్యాక్ వాటర్ ప్రభావం తీవ్రంగా ఉండడంతో సరైన సమయానికి పంటలు వేయడంలో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ సమయానికి విత్తనాలు వేసినా అవి మొలకెత్తే దశలో ఉన్నప్పుడు వర్షాలు కురవకపోవడం, భారీ వర్షాలతో పంటలు ముంపు బారిన పడడం ఇలా ఏదో రూపంలో రైతులు పంటనష్టాన్ని ఎదుర్కోక తప్పని పరిస్థితి. వీటన్నింటిని దాటినా దిగుబడి సమయానికి పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడం ఇలా ప్రతి ఏడాది విలీన రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచి సాగు ముందుకు సాగుతుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులతో తాము అప్పుల పాలవుతున్నామని చిన్న సన్నకారు రైతులు వాపోతున్నారు. పోని నష్టాల బారిన పడిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందా అంటే పోలవరం పరిహారం ఇచ్చామన్న పేరుతో నష్టపరిహారాన్ని కూడా ఇవ్వకుండా గాలికొదిలేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ ముంపునకు గురవుతున్న భూములకు 2017లో అప్పటి ప్రభుత్వం భూ పరిహారాన్ని చెల్లించింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి దాదాపు ఏడేళ్లు కావస్తున్నా ఈ రోజు వరకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించలేదు. అప్పటి నుండి ఇచ్చిన పరిహారం తింటూ కూర్చోమనడం ఎంతవరకు న్యాయమని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సేకరించిన భూములను సాగు చేసుకుంటున్నారు. పోని సాగు ఆపుదామా అంటే కూర్చొని తింటే ఎంతైనా కరిగిపోతాయన్న ఆవేదన నిర్వాసిత రైతుల్లో నెలకొంది. తమ సమస్యను ప్రజాప్రతినిధులకు వివరిస్తే వారేమో మీకు ప్యాకేజీ డబ్బులు ఇస్తాం.. ఆవేదన చెందొద్దు, మీరంతా త్యాగధనులు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలివ్వడం తప్ప సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టింది శూన్యం. ఇలా సాగులో నష్టాలు చవిచూస్తున్న రైతులు కుటుంబపోషణ భారమై పిల్లల చదువుల కోసం, పెళ్లిళ్ల కోసం అప్పుల బాట పట్టాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతో ఇతర ప్రాంతాల రైతులను ఎలాగైతే నష్టపరిహారాన్ని అందించి ఆదుకుంటుందో అదేవిధంగా పోలవరం పరిహారంతో సంబంధం లేకుండా విలీనమండలాల రైతులకు నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూడెకరాల పంట వరద పాలైంది



కివ్వాక గ్రామంలో నేను మూడెకరాల భూమిని ఎకరం రూ.50 వేల చొప్పున కౌలుకు తీసుకోని మిర్చి పంటను వేశాను. గత నెల వచ్చిన గోదావరి వరదతో పంట మొత్తం దెబ్బతింది. దీంతో ఎకరానికి దాదాపు రూ.30 వేలకు పైగా నష్టం వాటిల్లింది. పంట నష్టపరిహారం వస్తుందని భావించా. కానీ నేను సాగు చేసే భూములకు పోలవరం పరిహారం అందించామన్న పేరుతో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలేదు. మాకూ పంట నష్టపరిహారం చెల్లించాలి.

– రాయి కోటేశ్వరావు, కౌలు రైతు, కివ్వాక

నా పత్తి పంట మొత్తం దెబ్బతింది



నేను మూడున్నర ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. ఇటీవల గోదావరి వరద మూడవ ప్రమాద హెచ్చరికను చేరుకోవడంతో పంటమొత్తం వరద నీటిలో ముంపునకు గురైంది. ముంపు వీడిన తరువాత చూస్తే పంట మొత్తం ఎండి పోయింది. ఇక చేసేది లేక పంట సాగు చేయకుండా వదిలేశా. ఇతర ప్రాంతాల రైతులకు నష్టపరిహారం అందించే ప్రభుత్వం మాకు కూడా నష్టపరిహారం చెల్లించి నిర్వాసిత రైతులను ఆదుకోవాలి.

– బంధం దుర్గారావు, రైతు, ఉప్పరమద్దిగట్ల

చిన్న, సన్నకారు రైతులే నష్టపోతున్నారు



పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ చేసి ఆరేళ్లకు పైగా అవుతుంది. అయినా ప్రభుత్వం ఇంతవరకు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించలేదు. దీంతో ఖాళీగా ఉండలేక చిన్న, సన్నకారు రైతులు అధిక కౌలు రేట్లకు భూములను లీజ్‌కు తీసుకోని పంటలు సాగుచేసి ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. కౌలు ఇచ్చుకున్న పెద్దరైతులు బాగానే ఉన్నారు. సాగుతో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలి.

– కొన్నె లక్ష్మయ్య, సీపీఐ నాయకుడు, కుక్కునూరు

దేశవ్యాప్త అనుసంధానంతో 'సహకారం'

ఆకివీడు: సహకార సంఘాలు, ప్రాథమిక పరపతి సంఘాల (సొసైటీ) కంప్యూటరీకరణతో దేశవ్యాప్తంగా అనుసంధానం కాబోతున్నాయి. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు సొసైటీలన్నింటినీ అనుసంధానం చేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేట్టింది. దీనిలో భాగంగా సహకార రంగం కంప్యూటరీకరణపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. అన్ని సొసైటీల లోనూ, జిల్లా సహకార బ్యాంకు శాఖలలోనూ కంప్యూటరీకరణ పనులు వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని సొసైటీలు, డీసీసీబీ కార్యాలయాల్లో కంప్యూటరీకణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 262 సహకార పరపతి సంఘాలున్నాయి. ఆయా సొసైటీల్లోని 85 శాతం మేర రికార్డుల్ని కంప్యూటరీకరణ పూర్తయినట్టు సమాచారం. నెలాఖరు నాటికి ప్రక్రియను పూర్తి చేయనున్నారు. కంప్యూటరీకరణతో సొసైటీల లావాదేవీలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లనున్నాయి. జాతీయ బ్యాంకుల వలేనే సొసైటీలు కూడా కేంద్ర పరిధిలోకి వస్తున్నాయి. రానున్న రోజుల్లో సొసైటీలు, జాతీయ బ్యాంకుల్ని కూడా అనుసంధానం చేసే అవకాశం ఉందని ఉద్యోగులు అంటున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఉండి: చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20వ తేదీన ఉప్పులూరుకు చెందిన కొల్లి రక్షణబాబు (9)ను కొత్త చర్చ్ వద్ద రోడ్డుపై ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ బాలుడు శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని పోలీసులు తెలిపారు.

25 నుంచి సప్తనదీ జలాభిషేకాలు


పవిత్రోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థానం సిబ్బంది

కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కాళ్లకూరులోని స్వయంభూః వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీ నుంచి సప్తనదీ జలాభిషేకాలు, పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పవిత్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి, సరస్వతి, యమునా, గంగ, కృష్ణ, కావేరి, నర్మద నదుల జలాలతో స్వామివారికి అభిషేకాలు చేస్తామన్నారు. తొలిరోజు బుధవారం విశ్వక్సేన పూజ, దీక్షాధారణ, అంకురార్పణ, యాగశాలర్చన, హోమాలు నిర్వహిస్తామన్నారు. 28న హోమాలు, పవిత్ర విసర్జన, సప్తనదీ జలాల అభిషేకాలతో పాటు శాంతి కల్యాణాలు నిర్వహిస్తామన్నారు.

క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన బాలురు


ఏలూరు రూరల్: అక్టోబర్ 4వ తేదీ నుంచి 23 వరకూ కడపలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర జిల్లాల అండర్ 14 బాలుర క్రికెట్ పోటీలు జరగనున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి ఆదిత్య వర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టును 21న ఆశ్రం ఆసుపత్రి క్రీడా మైదానంలో ఎంపిక చేశామని వెల్లడించారు. జట్టులో పీవీఎస్ రేవంగ్‌వర్మ, కె పొన్నాన నారాయణ, కేవీఎస్ సుబ్బారాయుడు, జి గౌతమ్ రాజ్, పీసీహెచ్ నాగగణేష్, బి ధీరజ్‌నాయుడు, ఏహెచ్ జైన్, టీఎస్ఎస్ఎస్ మణికంఠ, టీడీ వెంకటేశ్వరరావు, బి రిత్విక్‌రెడ్డి, ఎస్ కార్తిక్‌వర్మ, ఎస్ మనోజ్‌కుమార్, జె జైవాన్స్, జి జీతేష్, ఏ నాగసాయిలక్ష్మణ్, వి గౌతమ్, ఏ పార్థసారథి, ఏ అజిత్, కేకేఎస్ కార్తికేయ, టి కౌషిక్‌రాయుడు, కె పృధ్వీ రాజ్, ఎండీ అల్తాఫ్‌అహ్మద్, ఎస్ శ్రీసూర్యతేజ, కె భరత్ అవినాష్ చోటు సాధించారని తెలిపారు. బీఎస్ మంగేష్, యూవీవీఎస్ఎస్ నాగేంద్రకుమార్, ఎస్‌కే షకీర్‌హుస్సేన్ జట్టు ఎంపిక నిర్వహించారని వివరించారు.

రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి

కాళ్ల: ఈ–కంటెంట్ రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికయ్యారని ఎంఈఓ ఎ.రవీంద్ర ఆదివారం విలేకరులకు తెలిపారు. సీఐఈటీ–ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ–కంటెంట్ అభివృద్ధి కొరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్ (ఎస్ఆర్‌జి)గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్‌లలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా రెండవ ఫేజ్ లో 23 నుంచి 27 వరకు 5 రోజుల పాటు ఆన్‌లైన్ శిక్షణలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మంది బృందంలో ఈయన కూడా ఎంపికైనట్లు తెలిపారు. ఈ కంటెంట్‌లో భాగంగా 3వ తరగతి గణితానికి సంబంధించి రూపొందించిన వీడియోలు ఏపీ ఈ–పాఠశాల యాప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరచామని స్వామి మాస్టారు తెలియజేశారు.

పారిశుద్ధ్య కాంట్రాక్టుపై సందిగ్ధం..!

గడువు పెంపు ప్రతిపాదనను తిరస్కరించిన ఈఓ


శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో వివాదాస్పదమైన పారిశుద్ధ్య కాంట్రాక్టు గడువును పెంచేందుకు ఇంజినీరింగ్ విభాగ అధికారులు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు వద్ద శనివారం సాయంత్రం చేసిన ఆఖరి ప్రయత్నం బెడిసికొట్టింది. సింహాచలం బదిలీ అయిన ఈఓ వేంద్ర త్రినాథరావు ఇక్కడ రిలీవ్ అవుతున్న క్రమంలో శనివారం పలు ఫైళ్లను పరిశీలించారు. ఆ సమయంలో పారిశుద్ధ్య కాంట్రాక్టు గడువును మరో ఏడాది పొడిగించాలంటూ ప్రతిపాదనలను ఈఓ ముందు ఉంచగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి తిరస్కరించినట్టు సమాచారం. దీనికి తోడు పారిశుద్ధ్య కార్మికులు తమకు జరిగిన అన్యాయంపై సెవెన్ హిల్స్ ఫెసిలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్‌కు చెందిన మేనేజర్‌ను నిలదీయడంతో ఆమె ఆదివారం పలాయనం చిత్తగించారు. ఇంజనీరింగ్ విభాగ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు గత కొద్దిరోజులుగా స్థానిక రాణీచిన్నయమ్మారావు సదనంలోని ఒక గదెను ఉచితంగా కేటాయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

న్యాయం కోసం ఎదురు చూపులు..

తమకు జరిగిన అన్యాయానికి ఇంజినీరింగ్ విభాగ అధికారులు, కాంట్రాక్టర్ కారణమని కొందరు కార్మికులు బాహాటంగా చెబుతున్నారు. న్యాయం చేయాల్సిన సంబంధిత సెక్షన్ అధికారులే తమకు అన్యాయం చేస్తే ఇక ఎవరికి చెప్పుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పేద విద్యార్థులకు వరం 'ఎన్‌ఎంఎంఎస్'

- ప్రతిభ కలిగిన విద్యార్థులకు నేషనల్ మీన్స్‌తో ప్రోత్సాహం
- దరఖాస్తు గడువు 24వ తేదీ వరకు పొడిగింపు


గతేడాది ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌ల కోసం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

యలమంచిలి: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అమలు చేస్తోంది. ఈ స్కాలర్‌షిప్ 2024–25వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 5వ తేదీన ప్రారంభం కాగా ఈ నెల 24వ తేదీ వరకు అవకాశాన్ని కల్పిస్తు చివరి తేదీని పొడిగించినట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.

ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ నిమిత్తం నెలకు రూ.1000 చప్పున ఏడాదికి రూ.12,000 అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది. నగదును ప్రతి సంవత్సరం విద్యార్థి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

దరఖాస్తు చేసుకోవడానికి అర్హతలు

ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3,50,000 మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. రాత పరీక్షల ద్వారా స్కాలర్‌షిప్ పొందడానికి విద్యార్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుము రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే పరీక్ష రుసుము రూ.50 చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షా రుసుంను ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. దరఖాస్తులను ప్రభుత్వ వెబ్ సైట్ www.bse.ap.gov.in నందు నమోదు చేసుకోవచ్చును. దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేది, తండ్రి పేర్లను నమోదు చేయాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోండి



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) ద్వారా విద్యార్థులు ఉపకార వేతనాలను పొందడానికి మంచి అవకాశం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చును. ఈ పరీక్షల్లో ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆటంకం కల్గించే ఆర్థిక పరమైన ఇబ్బందుల్లో ఈ ఉపకార వేతనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, ఎంఈఓ–2, యలమంచిలి

మామిడిలో సస్యరక్షణ చర్యలు ఇలా..

పాడి - పంట


మెట్ట ప్రాంతంలో విస్తరించి ఉన్న మామిడి తోటలు


ఎండీ షాఫియ ఫర్‌హీన్, ఉద్యాన శాఖ అధికారిణి

చింతలపూడి : మన రాష్ట్రంలో మామిడి తోటలు సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో పూతకు వస్తాయి. ఈ దశలో మామిడి రైతులు ఇప్పటినుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఒకపక్క మామిడి తోటల పునరుద్ధరణపై దృష్టి సారిస్తూనే మరో పక్క సస్యరక్షణపై ఉద్యాన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం, ద్వారకాతిరుమల, నల్లజర్ల, టి నరసాపురం ప్రాంతాల్లో సుమారు 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రతి ఏటా నాణ్యమైన పంట దిగుబడిని గణనీయంగా పెంచడానికి ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖ అధికారిణి ఎండీ షాఫియ ఫర్‌హీన్ తెలియజేస్తున్నారు. పూత రావడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచిస్తున్నారు.

పూత వచ్చే దశలో..

మామిడి రైతులు సెప్టెంబర్ మాసం నుంచే తోటల్లో దుక్కులు దున్నుకోవాలి. చెట్లకు కావలసిన ఎరువులను వేసుకోవాలి. అక్టోబర్ తరువాత మామిడి తోటలను దున్నకూడదు. ఈ దశలో దున్నితే చెట్ల వేర్లు కదిలి. పోషక పదార్థాల సమతుల్యత దెబ్బతింటుంది. సాధారణంగా మామిడిలో పూత ఒకేసారి రాదు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పూత వస్తూనే ఉంటుంది. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం రైతులకు కష్టం. ఈ సమస్యను అధిగమించేందుకు తేమ తక్కువ ఉండే నేలల్లో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తోటల్లో సూక్ష్మపోషక లోపాలను నివారించడానికి లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 3 గ్రాముల బోరాక్స్, 5 గ్రాముల ఫెర్రిక్ సల్ఫేట్, 10 గ్రాముల యూరియ కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. వర్షం పడితే రసం పీల్చే పురుగులు చేరే అవకాశం ఉండటం కారణంగా తోటల్లో కలుపు లేకుండా చూసుకోవాలి. తోటల్లో పూత, మొగ్గలు ప్రారంభమైన తరువాత మొగ్గలు విచ్చుకుని పూత రావడానికి 2 గ్రాముల బోరాన్ లేదా, 10 గ్రాముల మల్టీ–కేతో పాటు 5 గ్రాముల ఫార్ములా -4 మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగు నివారణ

తేనె మంచు పురుగులు, తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులను, పూత కాండాలను, లేత పిందెల నుంచి రసం పీల్చి నష్టం చేస్తాయి. దీనివల్ల ఆకుల చివర్లు మాడిపోతాయి. పూత మాడిపోతుంది. పిందెలు బలహీన పడి రాలి పోతాయి. అంతే కాకుండా ఈ పురుగులు విసర్జించే పదార్థం వల్ల ఆకులు, కాయలపై మసిపొర ఏర్పడుతుంది. పూత, పిందె దశలో ఈ పురుగుల ఉద్ధృతి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లో ఈ పురుగులు చెట్టు మొదలు, కొమ్మల బెరడుల్లోని పగుళ్లలో ఉంటాయి.

నివారణ..

వీటి నివారణకు 1.5 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత మొగ్గ దశలో లీటరు నీటికి 1 మి.లీటరు డై క్లోరోఫాస్ లేదా 3 గ్రాముల కార్బోరిల్ కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. పచ్చ పూత దశలో, మొగ్గ దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీటర్ల మోనో క్రోటో ఫాస్ లేదా డైమిథోయేట్, లేదా 3 మి.లీటర్ల మిథైల్ డెమాటాన్, లేదా 0.25 మి.లీటర్ల ఇమిడా క్లోప్రిడ్ పిచికారీ చేయాలి.

బూడిద రంగు తెగులు

మామిడి లేత ఆకులు, పూత కాండం, పూలమీద, చిరు పిందెల మీద తెల్లటి పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీన్నే బూజు తెగులు అంటారు. రాత్రిళ్లు చల్లగా, పగలు వేడిగా ఉన్నప్పుడు ఇది ఆశిస్తుంది. దీని వల్ల పూత రాలి పోతుంది. దీని నివారణకు మొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి 3 గ్రాముల గంధకం కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో తెగులు కనిపిస్తే హెక్సా కోనజోల్ 2 మి.లీటర్లు, లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీటరు లేదా డినోకాఫ్, లేదా ట్రై డిమార్ఫ్ 1 మి.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలీ.

తాడిచెట్టుపై పిడుగు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలోని చొప్పరమెట్ల గ్రామంలో తాడిచెట్టుపై పిడుగు పడింది. ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో భారీ శబ్దంతో చొప్పరమెట్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గల తాడిచెట్టుపై పిడుగు పడింది. చెట్టు పూర్తిగా దగ్ధమై పక్కనే ఉన్న కారుకొండ రవికుమార్‌కి చెందిన గేదెల పాకకు మంటలు వ్యాపించడంతో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. గృహాల మధ్యలో పిడుగు పడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్, పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులకు ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ పెనుమత్స రంగరాజు (హైదరబాద్) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సొసైటీ కార్యాలయంలో విద్యార్థులు కె.సుజనా హరిణి, వై.మనీషా, వైఎస్వీ యువశ్రీ, జేవీఎస్ దుర్గా కుమార్, నక్కా శ్రీనివాస్, అయినాల సురేంద్రలకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి గరికపాటి బాపయ్య శర్మ, బ్రాంచి మేనేజర్ లోవరాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాలు సద్వినియోగం చేసుకోవాలి



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు బహూకరించిన ఐరన్ ర్యాక్‌లు

అత్తిలి: విద్యాభివృద్ధికి దాతల అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నేతృత్వంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడు గ్రామాన్ని దత్తత తీసుకున్న డాక్టర్ దండు పద్మావతి సౌజన్యంతో బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి, గ్రామంలో గల రెండు ప్రాథమిక పాఠశాలలకు ఐరన్ ర్యాక్‌లను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు

తణుకు: హోప్ ఫర్ లైఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆదివారం తణుకు నుంచి నిత్యావసరాలను అందజేశారు. పలువురు దాతల నుంచి సేకరించిన నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, బియ్యం ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి బాధితులకు అందజేశారు. సామాజికవేత్త జి.ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రదీప్, శివరామకృష్ణ, హేమంత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దువ్వలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని 23 మంది గర్భిణులకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అద్దా బాబు, తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

నరసాపురం: పట్టణంలో ప్రధాన డ్రెయినేజీలను శుభ్రం చేసి పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలను పరిశీలించారు. ప్రతిరోజూ డ్రెయినేజీలను శుభ్రం చేయడం ద్వారా దోమల సమస్యలుండవని చెప్పారు. ఇటీవల వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- పలుగ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ప్రధాన ప్రాంతాల్లో కనిపించని పరిశుభ్రత
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాంగం



మీనవిల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద పేరుకుపోయిన మొక్కలు, శిథిలమైన వాహనాలు

పెంటపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడి గొంగలి అక్కడే అన్నట్లు మండలంలో ఏ గ్రామంలో చూసిన పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలు, చెత్త కుప్పలు ఎక్కువగా పేరుకుపోవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తైన చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామ వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సర్పంచ్‌లు ఏ పని చేయాలన్నా తమకు చెప్పి చేయాల్సిందే అని అధికారులకు అధికార పార్టీ మద్దతు ఉన్న సర్పంచ్‌లకు హుకుం జారీ చేయడంతో పంచాయతీల్లో నిధులు ఉన్న సర్పంచ్‌లు గ్రామాధికారులు ఎటు చెప్పాలో తెలియక గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శీతకన్ను వేశారు. ఒక వైపు వ్యాధుల కాలం ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరాలు, డయేరియా, మలేరియావంటి రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు గ్రామాల్లో వతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గ్రామాల్లో మురుగు నీటి కాలువలలో పూడిక తీసి వాటర్ ట్యాంకులను నిర్ణీత సమయానికి క్లోరినేషన్ చేయడం, బ్లీచింగ్ చల్లి గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి చెత్త పోస్టు ద్వారా ఎరువులు తయారు చేసేవారు. ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తు ఫీవర్ సర్వే చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పారిశుద్ధ్యం చర్యలు గాలికొదిలేశారు. పల్లపు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు కాలువల్లో నీరు అధికంగా చేరి చెత్త చెదారం కుళ్లిన వ్యర్థాలతో కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించడంతో దోమలు పెరిగి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో అధికారులు తూతూ మంత్రంగా మురుగునీటి కాలువల్లో పూడిక్తీసి చెత్తను వేరే ప్రాంతాలకు తరలించకుండా మరలా అదే ప్రదేశంలో చెత్తను వేయకుండా నిరోధించడానికి అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ప్రధానంగా విప్పర్రు గ్రామంలో డ్రెయినేజీల నీరు తాగునీటి చెరువులో కలుస్తోంది. పెంటపాడు పీహెచ్‌సీ వెనుక వీధి, కునాకరపేట జగజ్జీవన్ విగ్రహం వద్ద, వెలమపేట లోనూ, కొబ్బరితోట ప్రాంతంలో డ్రెయినేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. అక్కడ మురుగునీరు పేరుకుపోయింది. వర్షంతోడై ఆ నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. కచ్చా డ్రెయినేజీలు శుభ్రం చేసి నెలలు గడుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు.



తూర్పుకాపుల కాలనీకి వెళ్లేదారిలో డ్రెయినేజీపై అలముకున్న గడ్డి



మీనవిల్లూరు దేవీ సెంటర్‌లో ప్రభుత్వ స్కూల్‌కు వద్ద చెత్త



ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద తుప్పు పట్టిన రిక్షాలు

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టీ జనర్దానరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భర్త యాక్సిడెంట్‌లో చనిపోవడంతో ఇద్దరు చంటి పిల్లలతో ఎటువంటి ఆసరా లేని నిరుపేద మహిళకు ఆదివారం రెండు నెలలకుగాను సాయం రూ. 8 వేలు ట్రస్టీ జనార్ధనరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు మరింత సాయం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, ప్రకాశ్‌రావు తదతరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో ఎనిమిది మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు సుంకవల్లి నీలూ మహేంద్రల ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, పైడిపర్రు, పాలంగి పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని 8ఎనిమిది మంది వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు అందజేశారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహలిక, కోశాదికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయాలి



ఉమ్మడి జిల్లా రాజకీయ తరగతులు పాల్గొన్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా రాజకీయ తరగతులు రెండోవ రోజు ఆదివారం పట్టణంలో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని దోపిడి చేస్తున్న పెట్టుబడిదారీ సమాజాన్ని నిర్మూలించే సమసమాజ స్థాపన కోసం జరిగే పోరాటంలో కార్మిక వర్గం ముందుకు భాగాన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ యర్రా శ్రీను, జిల్లా కోశాధికారి ఎం.నాగరాజు, వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, మామిడి దాన వరప్రసాద్, గ్రీష్మకుమార్, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



బల్లిపాడు పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: ఆరోగ్యం పై తగు జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ సెక్రటరీ పి మనోజ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామ సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. ఆరోగ్య భద్రతకు వైద్యసిబ్బంది తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ శ్రీనివాస్, స్థానిక నాయకులు దాసం ఆదినారాయణ, గారపాటి బాబ్జి, ఆచంట సుబ్బారావు, ఆకుల రామచంద్రరావు, కసిరెడ్డి అప్పారావు, గారపాటి అశోక్. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి పాల్గొన్నారు.

ఏచూరి, ఆర్ఎస్‌లకు ఘన నివాళి



పాలకొల్లు సమతా భవన్‌లో ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మతాలను రాజకీయాలకు ముడిపెట్టకూడదని పోరాడిన వ్యక్తి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి అని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని సమతా భవన్‌లో సీపీఎం జాతీయ నేత కామ్రేడ్ సీతారామ్ ఏచూరి, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) మృతికి ఎస్ఎఫ్ఐ ఎక్స్‌లెంట్ టీమ్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు డి.అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి నిరంతరం అండదండగా ఉద్యమాలు చేసిన వ్యక్తులు సీతారామ్, ఆర్ఎస్‌లు అని వారి సేవలను కొనియాడారు. అలాగే ఇటీవల మృతి చెందిన వలవల శ్రీరామమూర్తి, ఎ.సత్తిరాజులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తొట్టెంపూడి కోటేశ్వరరావు, యర్రా అజయ్‌కుమార్, చల్లా సోమేశ్వరరావు, టి.అప్పాజీ, కన్నబాబు, జెసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గుర్రం జాషువా పద్యపఠన పోటీలు



పద్యపఠన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా అంబేడ్కర్ ఆలోచనల వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయురాలు తాడిమేటి కృష్ణవేణి, రవుతుల రామ్మోహన్, తెలుగు ఉపాధ్యాయుడు నాగభూషణం లు వ్యవహరించారు. ఈ పోటీల్లో 20 పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో జరిగే గుర్రం జాషువా జయంతి సభలో బహుమతులను అందిస్తామని నిర్వాహకుడు, అంబేడ్కర్ ఆలోచనల వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సు.దీర్‌మోహన్ తెలిపారు.

ఆచంట వేమవరంలో సామూహిక సీమంతాలు



ఆచంట వేమవరంలో సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకొన్న సందర్భంగా నిర్వహిస్తున్న మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆదివారం ఆచంట మండలం ఆచంట వేమవరంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొని లోగోను ఆవిష్కరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.అలాగే పోడూరు మండలం పండిత విల్లూరులో ఆదివారం మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యిళ్ల లక్ష్మీ చందిక, ప్రత్యేకాధికారి జీ వెంకట సూర్యనారాయణ, శివయ్య, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

పెనుగొండ: మండలంలోని చెరుకువాడ బ్రహ్మలింకాలంబ ఆలయం సమీపంలో పేకాట స్థావరం పై నిర్వహించిన దాడిలో పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సమాచారం రావడంతో దాడి చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.54,600 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

మండుటెండ.. కుండపోత

- మండుతున్న ఎండ, అంతలోనే వాన
- విచిత్ర వాతావరణంతో ప్రజల అవస్థలు



ఆదివారం సాయంత్రం కుండపోతగా కురుస్తున్న వర్షం



మధ్యాహ్న సమయంలో విజృంభిస్తున్న సూర్యుడు

తణుకు: ప్రస్తుతం వాతావరణం చాలా విచిత్రంగా ఉంటోంది. అసలు ఏ కాలమో తెలియని విధంగా ప్రవర్తిస్తోంది. ఉదయం నుంచే సూర్యుడు ఎండతో బెంబేలెత్తిస్తున్నాడు. వేసవి కాలం మాదిరిగా విజృంభిస్తున్నాడు. తణుకు నియోజకవర్గంలో ఇటీవలి కాలంలో అంతలోనే వరుణుడు రంగంలోకి దిగుతున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ దాడి... అంతలోనే సాయంత్రం అయ్యేసరికి కుండపోత వర్షం... ఇలా వాతావరణంలో వచ్చిన మార్పులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, ఒళ్లనొప్పులు, దగ్గు తదితర రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

విచిత్ర వాతావరణం...

ఎండకాలంలో భానుడి వేడితో అల్లాడిన ప్రజలు వర్షాకాలంలో ఆహ్లాదకర వాతావరణంతో సేదతీరుతుంటారు. గతంలో ఎప్పుడు ఇలాగే జరిగిది. వర్షాకాలంలో ఎండ కాసినా అంత ప్రచండంగా ఉండేది కాదు. అయితే ఇప్పుడు మాత్రం ఒకపక్క వరుణుడు, మరోపక్క భానుడు పోటాపోటీగా ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఉదయం నుంచే ఎండ రావడంతో ఉక్కపోత ఎక్కువై పోతోంది. వేసవి కాలం మాదిరిగా ఇళ్లలో ఏసీలు పని చేయాల్సి వస్తోంది. మరోవైపు ఇంతలోనే కుండపోతగా వర్షం కురుస్తుంది. వాతావరణంలో ఇంత మార్పు రావడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్ అని నిపుణులు చెబుతున్నారు. దాని వల్ల ఇలాంటి విచిత్ర వాతావరణం నెలకొందన్నారు. నేలపై పచ్చని చెట్లు లేకుండా నరికివేయడంతో ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్పష్టం చేస్తున్నారు. గతంలో నగరాలలో చెట్లను నరికివేశారని, ఇప్పుడు ఓ మాదిరి పెద్ద గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. చెట్లను నరికివేయడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడం, తోటలు, పచ్చని పొలాలను నాశనం చేసి లేఅవుట్లు వేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందని చెబుతున్నారు. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. రెండ్రోజులుగా ఉష్ణోగ్రత 33 డిగ్రీలకుపైగా నమోదు అవుతోంది.

పెరిగిన ఏసీల వినియోగం...

గతంలో వేసవి కాలంలోనే ఏసీలను బాగా ఉపయోగించేవారు. మిగిలిన కాలాలలో వాటి వినియోగం ఉండేది కాదు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. కాలానికి సంబంధం లేకుండా ఏసీలు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలమైనా ఏసీల వినియోగం బాగా పెరిగింది. ఎండలు బాగా పెరిగిపోవడంతో వాటి వాడకం తప్పనిసరి అయ్యింది. ఇక రోడ్డు పక్కన వ్యాపారం చేసుకున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే ఎండ రావడంతో ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. అంతలోనే వాన కురవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపక్కన వస్తువులను పేర్చి విక్రయాలు జరిపేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాన కురిసినప్పుడు వాటిని సర్దుకోవడం చాలా ఇబ్బందిగా మారుతోంది. అనుకోకుండా వర్షం కురవడంతో ప్రజలు బయటకు రావడం లేదు. దీని వల్ల వ్యాపారాలు కూడా సక్రమంగా లేదు.

ఆకట్టుకున్న నాణేలు, స్టాంపుల ప్రదర్శన



స్టాంపులు, నాణేల వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ బాబ్జి తదితరులు

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో నేటి యువతరానికి పురాతనమైన వస్తులపై అంతగా అవగాహన లేదని ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులు పురాతన వస్తువులు వాటి వినియోగంపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో యూత్ హాస్టల్స్ పాలకొల్లు శాఖ 32వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నాణేలు, స్టాంపుల ప్రదర్శన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు వచ్చి తిలకించే విధంగా ఆయా పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శన నిర్వాహకులు అందరూ సుమారు 50 నుండి 60 ఏళ్ల వయస్సు పైబడిన వారేనని అన్నారు. నేటి యువతరంతో పాటు భవిష్యతరాల ప్రజలకు కూడా పురాతన వస్తువులపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి వాటిని సేకరించి ఇలా ప్రదర్శనగా పెట్టడం అభినందనీయమన్నారు. పాలకొల్లుకు చెందిన కంచర్ల రాజేష్ ప్రపంచ దేశాలకు చెందిన బంగారం, వెండి, రజత నాణేలు, కారుమూరి సురేఖ ప్రత్యేకంగా ఏనుగులతో ఉన్న అనేక రకాల స్టాంపులు, అనకాపల్లికి చెందిన కొణతాల శ్రీనివాసరావు ఒకే నెంబర్‌తో ఉన్న నోట్లు, అమలాపురానికి చెందిన పుత్స కృష్ణ కామేశ్వరరావు 243 దేశాల కరెన్సీ నోట్లును ప్రదర్శనలో ఉంచారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహరావు, యూత్ హాస్టల్స్ సభ్యులు కారుమూరి సూర్యనారాయణ, కొట్టు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

పాలకోడేరు: సమసమాజం కోసం కాంక్షించిన మానవతావాది పిన్నమనేని ప్రతాప్‌రాజు అని ఏబీఎస్‌వీకే ట్రస్టు చైర్మన్ బి.బలరాం అన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం విస్సాకోడేరు రావిచెట్టు వద్ద పిన్నమనేని ప్రతాప్‌రాజు వర్ధంతిని నిర్వహించారు. విస్సాకోడేరులో, మోగల్లు గుత్తులవారి పాలెంలో వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రీయ్య, నాయకులు దున్నా మరియమ్మ, గోపాలరాజు, ఖండవల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో ఉచిత ధ్యాన శిక్షణ

పెనుమంట్ర: స్థానిక బ్రహ్మర్షి పత్రీజి పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమాచంద్ ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం రెండూ డబ్బుతో కొనలేనివని శాకాహారం ద్వారా ఆరోగ్యాన్ని ధ్యానసాధన ద్వారా ఆనందాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరావుజు, సాయిగీత, జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ పాల్గొన్నారు.